సాక్షి పెద్దపల్లి
ఆదివారం । 23 । మార్చి । 2025



ఆస్తిపన్నుపై దృష్టి సారించాలి

పెద్దపల్లిరూరల్: ఆస్తిపన్నుతోపాటు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు గడువులోగా వసూలయ్యేలా చూడాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. రాఘవాపూర్, అప్పన్నపేటలో పర్యటించి సూచనలు చేశారు.



'పీఎం కుసుం'పై అవగాహన

పెద్దపల్లిరూరల్: పీఎం కుసుం పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఎస్‌ఈ మాధవరావు తెలిపారు. ఈమేరకు దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు.



	ఇఫ్తార్ ఆదివారం (సా॥)	సహర్ సోమవారం (ఉ॥)
కరీంనగర్ :	6.29	4.58
పెద్దపల్లి :	6.34	4.56
సిరిసిల్ల :	6.28	5.06
జగిత్యాల :	6.34	4.56

న్యూస్‌రీల్

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- ముఖ్య అతిథులుగా కేటీఆర్, హరీశ్‌రావు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్: తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సన్నాహక సమావేశం ఆదివారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని వీ–కన్వెన్షన్‌లో జరగనుంది. ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశాన్ని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు హాజరు కానున్నారు. శనివారం వీ– కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్ వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఏర్పాట్లు పరిశీలించారు. సమావేశానికి పార్టీ మాజీ కార్పొరేటర్లు, మాజీ కో– ఆప్షన్ మెంబర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రత్యేక పరిస్థితుల్లోనే గర్భస్రావానికి అనుమతి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్న

పెద్దపల్లిరూరల్: గర్భస్రావాన్ని ఇష్టానుసారంగా చేస్తే చర్యలు తప్పవని, ప్రత్యేక పరిస్థితుల్లోనే అనుమతినిస్తారని డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్టులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో 12 ఆస్పత్రులకే అనుమతి ఉందని, అందులో ఇటీవల ఓ ఆస్పత్రిని సీజ్ చేశామన్నారు. గర్భవతికి మానసిక, శారీరక ఆరోగ్యానికి హాని కలిగే అవకాశమున్నప్పుడు, వైకల్యం గల బిడ్డ పుట్టే అవకాశం ఉన్నప్పుడు, బలత్కారానికి గురై గర్భం దాల్చినప్పుడే గర్భ స్రావం చేసేందుకు అనుమతి ఉంటుందన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చందన్ కుమార్ సమంత

జ్యోతినగర్(రామగుండం): నీటిని పొదుపుగా వినియోగించాలని రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత సూచించారు. ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీపీసీలో శనివారం నిర్వహించిన కార్యక్రమాన్ని చందన్‌కుమార్ సమంత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణపై శిక్షణ, పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త, సాంకేతిక సలహాదారు డాక్టర్ ఎన్.రవీందర్ 'నీటి ప్రాముఖ్యత –నీటి దినోత్సవం ప్రాముఖ్యత' అంశంపై ప్రసంగించారు. నీటి సంరక్షణపై ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. జీఎం(ఓఅండ్ఎం) ఏఆర్ దాస్, జీఎం(ఆపరేషన్స్) కేసీ సింఘరాయ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు 7,374 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి హిందీ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 7,383 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 7,374 మంది విద్యార్థులు హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతోపాటు ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని శంకర్‌గంజ్ ప్రాంతంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు ల నిర్వహణ కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాంసం మంచిదేనా?



అధికారుల ధ్రువీకరణలేని మటన్



మల్యాపూర్ గ్రామ శివారులో నిరుపయోగంగా ఉన్న బల్దియా స్లాటర్‌హౌస్

జిల్లాల్లో మాంసం దుకాణాలు

బల్దియా	రామగుండం	పెద్దపల్లి	సుల్తానాబాద్	మంథని
మటన్	73	18	03	07
చికెన్	25	30	02	11
మటన్, చికెన్ (అనధికారికంగా)	70	50	10	10

- బల్దియాల్లో నిబంధనలు బేఖాతరు
- పశువైద్యులు ధ్రువీకరించకుండానే జీవాలను వధిస్తున్న వ్యాపారులు
- స్టాంపింగ్ లేకుండా బహిరంగంగానే జోరుగా మటన్ విక్రయాలు
- వ్యాధులు సోకిన మేకలు, గొర్రెలు కోస్తున్నట్లు సర్వత్రా ఆరోపణ

కోల్‌సిటీ(రామగుండం): చికెన్ ప్రియులకు బర్డ్‌ఫ్లూ భయం పట్టుకోవడంతో మేకలు, గొర్రెపోతుల మాంసానికి డిమాండ్ పెరిగింది. ఇదేస్థాయిలో మటన్ ధరలు బాగా పెరిగాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యాపారులు.. నిబంధనలు ఉల్లంఘిస్తూ విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్యంగా ఉన్నాయని పశువైద్యులు ధ్రువీకరించాకే మేకలు, గొర్రెలను మున్సిపల్ స్లాటర్ హౌస్‌ల్లో వధించాల్సి ఉంది. కానీ ఈ నిబంధన జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. అధికారుల నిఘా కొరవడడంతో అనారోగ్యంతో ఉన్న జీవాలను వధించి వాటి మాంసం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమ స్లాటర్‌హౌస్‌లు..

జిల్లాలోని నగరపాలిక, మూడు పురపాలికల్లో అక్రమ స్లాటర్‌హౌస్‌లు నిర్వహిస్తున్నారు. రామగుండం నగరంలోని మల్యాపూర్ శివారులో 2009లోనే 12వ ఆర్థిక సంఘానికి చెందిన నిధులు రూ.రూ.43 లక్షలు వెచ్చించి స్లాటర్‌హౌస్ నిర్మించారు. దీనిని నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో గోదావరిఖని కల్యాణ్‌నగర్, ఫైవింక్లయిన్ చౌరస్తా, ఎన్టీపీసీ, రామగుండం, యైటింక్లయిన్‌కాలనీల్లో అనధికారికంగా స్లాటర్‌హౌస్‌లు నిర్వహిస్తున్నారు. ఇవి కూడా అపరిశుభ్రంగా ఉంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో చనిపోయిన మేకలు, గొర్రెలు, వాటి చర్మాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారు. ఇటీవల ఇలాంటి నలుగురు వ్యాపారులను గుర్తించిన అధికారులు.. వారికి జరిమానా విధించారు.

కనిపించని స్టాంపింగ్..

మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయని పశువైద్యులు ధ్రువీకరించిన తర్వాతనే మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది స్టాంపింగ్(ముద్ర) వేయాల్సి ఉంటుంది. కానీ, మటన్ విక్రయ ప్రాంతాల్లో ఎక్కడ కూడా స్టాంపింగ్ వేసిన దాఖలాల్లేవ్. కొందరు అనధికారికంగా మున్సిపల్ రబ్బరు స్టాంప్ తయారు చేసుకొని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.

మిగిలిన మటన్ మరుసటి రోజు విక్రయం..

మిగిలిన మాంసాన్ని ఐస్‌బాక్స్‌ల్లో భద్రపరిచి మరుసటి రోజు విక్రయిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. లాభాపేక్షతో కొందరు దుర్వాసన వస్తున్న మాంసం కూడా విక్రయిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఓ వ్యాపారి కుళ్లిన మాంసం విక్రయించిన వ్యవహారం వివాదాస్పదమైంది.

అనుమానాలకు తావిస్తోంది



కొందరు వ్యాపారులు లాభాపేక్షతో అనారోగ్యానికి గురైన వాటిని వధించి విక్రయిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. మేకలు, గొర్రెలను పరిశీలించిన తర్వాతనే స్లాటర్ హౌస్‌లో వధించాలి.

– మార్కపురి సూర్య, వినియోగదారు

ప్రాణాలతో చెలగాటమా?



బర్డ్‌ఫ్లూకు భయపడి ధర ఎక్కువైనా మటన్ కొంటున్న ప్రజల ప్రాణాలతో వ్యాపారులు, అధికారులు చెలగాట మాడుతున్నారు. మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? అనేది ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మాంసంపై ఎక్కడా మున్సిపల్ స్టాంప్ కనిపించడం లేదు.

– ఈదునూరి శంకర్, వినియోగదారు

చర్యలు తీసుకుంటాం



మాంసం విక్రయాల్లో నిబంధనలు ఉల్లంచేవారిపై చర్యలు తీసుకుంటాం. రామగుండంలోని స్లాటర్ హౌస్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం. చనిపోయిన మేకలు, వధించిన తర్వాత వ్యర్థాలను నాలాల్లో వేస్తున్న వ్యాపారులపై జరినామా విధిస్తున్నాం.

– అరుణశ్రీ, కమిషనర్, రామగుండం బల్దియా

స్లాటర్‌హౌస్‌కు మరమ్మతు చేయండి

- బల్దియా కమిషనర్ అరుణశ్రీ



స్లాటర్‌హౌస్‌ను పరిశీలిస్తున్న అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం బల్దియాలోని స్లాటర్‌హౌస్ భవన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్(ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ ఆదేశించారు. నగరంలో పురోగతిలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను ఆమె శనివారం పరిశీలించారు. మల్యాపూర్ శివారులోని పశువధశాల కిటికీలు చోరీకి గురవడంతోపాటు గోడల నుంచి తొలగించిన కిటికీల ప్రాంతాల్లో మరమ్మతులను వేగంగా పూర్తిచేయాలన్నారు. అనంతరం 39వ డివిజన్ ఖాజీపల్లిలో చేపట్టిన రోడ్డు పనులు, 29వ డివిజన్ బాపూజీనగర్ ప్రధాన రహదారిలో చేపట్టిన నీటిసరఫరా పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి నీటికొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, డీఈఈ షాభాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు రుసుంలో 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం నగర సంస్థ కమిషనర్(ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ, ఈనెలాఖరుతో గడువు ముగుస్తుందని, ఈలోగా రుసుం చెల్లించాలన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ ప్రసాద్, అధికారి నవీన్ పాల్గొన్నారు.

టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: తన నియోజకవర్గాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. తన నియోజకవర్గం పరిశ్రమలకు, ఆధ్యాత్మికతకు నిలయమన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నిరంతరం 5 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని తెలిపారు. ఇక్కడ రిసార్ట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రామునిగుండాల గుట్ట, శ్రీత్రిలింగ రాజరాజేశ్వరస్వామి ఆలయం, గోదావరి నదీపరీవాహక ప్రాంతం ఆధ్యాత్మికతకు సూచికగా ఉన్నాయని అన్నారు. సింగరేణిలోని 7ఎల్‌ఈపీ బొగ్గు గనిని మైనింగ్ టూరిజంగా గతంలో ప్రకటించినా.. ప్రస్తుతం మూసివేశారని తెలిపారు. దానిని యథావిధిగా కొనసాగించేలా చూడాలని ఆయన కోరారు. పారాగ్లైడింగ్, హట్ బెలూన్స్, మైనింగ్ టూరిజం, టెంపుల్స్ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. నదీ ప్రాంతంలో బోటింగ్ తదితర ఏర్పాట్లను చేయాలని ఆయన కోరారు.

కుట్టుశిక్షణతో ఆర్థికంగా ఎదగాలి

కమాన్‌పూర్(మంథని): మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కుట్టుశిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో కాళిందిని సూచించారు. మండల కేంద్రంలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు కుట్టుశిక్షణ ఇవ్వడానికి జిల్లాలోని కమాన్‌పూర్, సుల్తానాబాద్, ఎన్టీపీసీలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విక్టరీ ఫ్యాషన్ డిజైనరీ వారితో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కమాన్‌పూర్ కేంద్రంలో కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలపల్లి, ఎలిగేడు, ధర్మారం, ఎన్టీపీసీలో పాలకుర్తి, అంతర్గాం, రామగుండం అర్బన్ మండలాల వారికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రతీ మండలానికి 20మందికి శిక్షణ ఇస్తారని వెల్లడించారు. శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టడానికి ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీపీఎం నాగేశ్వరరావు, ఏపీఎం శైలజశాంతి, పిట్టల పద్మ పాల్గొన్నారు.

వర్షార్పణం

- 2,627 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం
- 1,514 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట
- 1,084 ఎకరాల్లో ధ్వంసమైన మొక్కజొన్న
- క్షేత్రస్థాయిలో సర్వేచేసిన వ్యవసాయాధికారులు
- పరిహారం అందించాలని అన్నదాతల డిమాండ్



భోజన్నపేట గ్రామంలో బాధిత రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, అధికారులు తదితరులు



భోజన్నపేటలోని వరి పొలంలో నిలిచిన వర్షపునీరు



ఎలిగేడు : రాలిపోయిన మామిడికాయలు



హన్మంతునిపేటలో నేలవాలిన మొక్కజొన్న పంట



ఈ రైతు పేరు గుర్రం సతీశ్. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట స్వగ్రామం. తనకున్న 1.5 ఎకరాలతోపాటు మరో ఆరెకరాలను కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న వేశాడు. శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్లకు రెండు పంటలూ నేలవాలాయి. కొద్దిరోజుల్లోనే పంట చేతికొస్తుందని ఆశపడితే ప్రకృతి పగబట్టిందని సతీశ్ వాపోయాడు.



హన్మంతునిపేటలో ఒకవైపు వంగిన విద్యుత్ స్తంభాలు

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్‌రూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో వరి, మొక్కజొన్న, మామిడిపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల్లోనే పంటలకు అత్యధికంగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. జిల్లా మొత్తంగా 1,896 మంది రైతులకు చెందిన సుమారు 2,627 ఎకరాల్లోని వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అత్యధికంగా 1,035 మంది రైతులకు చెందిన 1,514 ఎకరాల్లో వరి, 828 మంది రైతులకు చెందిన 1,084 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలిందని వారు వివరించారు.

దెబ్బతిన్న పంటలు పరిశీలించిన అధికారులు..

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, ఏడీఏ శ్రీనాథ్, ఏవో అలివేణితో పాటు ఏఈవోలు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టం వివరాలను ప్రాథమికంగా అంచనావేశారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట, హన్మంతునిపేట, చీకురాయి, రాంపల్లి, గౌరెడ్డిపేట, ముత్తారం తదితర గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించి రైతులతో మాట్లాడారు. అత్యధికంగా వరి 1,514 ఎకరాల్లో నష్టం జరగ్గా, ఆ తర్వాత మొక్కజొన్న 1,084 ఎకరాల్లో నేలవాలిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. మరో 20 ఎకరాల్లో కూరగాయలు, ఇంకో 10 ఎకరాల్లో పెసర, మిరపలాంటి పంటలు నష్టపోయాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు.

చేతికందే దశలో.. చేజారింది

వరి, మొక్కజొన్న కొద్దిరోజుల్లోనే చేతికి వచ్చేవని, ఈలోగా అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు పాడై తీరని నష్టాన్ని కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి దిగుబడులు సాధిస్తామన్న తమ ఆశలన్నీ అడియాసలయ్యాయని వాపోయారు. అకాల వర్షాలకు పంట నష్టం కలిగి.. దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో సరాసరి వర్షపాతం 15.3 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా ధర్మారం మండలంలో 46.8 మి.మీ. వర్షం కురరవగా అత్యల్పంగా 2.2మి.మీ. వర్షపాతం ముత్తారం (మంథని) మండలంలో నమోదైందని ముఖ్యప్రణాళికాధికారి రవీందర్ తెలిపారు. పెద్దపల్లిలో 33.0 మి.మీ., ధర్మారంలో 46.8 మి.మీ., అంతర్గాంలో 27.3 మి.మీ., పాలకుర్తిలో 3.6 మి.మీ., రామగుండంలో 8.1 మి.మీ., రామగిరిలో 19.2 మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకున్న నాలుగున్నర ఎకరాల్లో వరి, మొక్కజొన్న వేసిన. రాళ్లవానకు పంటలన్నీ నేలవాలాయి. చేతికి అందుతుందనుకున్న దశలో తీరని నష్టం జరిగింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఎనగందుల శ్రీనివాస్, రైతు, పెద్దబొంకూర్

పెట్టుబడి కూడా రాదు



నాకున్న రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. కంకి, పాలుపోసే దశలో ఉండగా వడగండ్లకు పంట నేలవాలింది. దాదాపు రూ.90 వేల దాకా నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే పరిహారం అందించాలి.

– మల్లెత్తుల బక్కయ్య, రైతు, ధూళికట్ట

ప్రభుత్వానికి నివేదిస్తాం



అకాల వర్షానికి సుమారు 2,627 ఎకరాల్లోని వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఏఈవోలు, క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ వివరాలు సేకరించారు. వివరాలను ప్రభుత్వానికి వెంటనే నివేదిస్తాం.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

రామగుండం బల్దియా క్లీన్‌పై క్యూసీఐ నజర్

- నగరంలో పర్యటించిన ఢిల్లీ ప్రతినిధుల బృందం



వివరాలు సేకరిస్తున్న క్యూసీఐ ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థను చెత్త రహిత ప్రాంతం(జీఎఫ్‌సీ)గా అభివృద్ధి చేస్తున్న తీరును ఢిల్లీ నుంచి వచ్చిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) ప్రతినిధులు రంజిత్ పుత్ర, జీవన్ కిశోర్ నాయక్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలిరోజు స్థానిక 21వ, 22వ డివిజన్లలోని పాత రామగుండం, అయోధ్యనగర్‌లో పర్యటించిన ప్రతినిధులు.. పలు ఇళ్లలో తడి, పొడి చెత్తను సేకరిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఈ ప్రక్రియకు సంబంధించిన వివరాలు, ఫొటోలను వారు సేకరించారు. స్థానికులతో మాట్లాడి పారిశుధ్యం పనితీరుపై అభిప్రాయాలను తీసుకున్నారు. రహదారులపై వీధి దీపాలు, ఫుట్‌పాత్‌లు, రోడ్లపై చెత్త కుప్పలను ప్రతినిధులు పరిశీలించారు. సుమారు వారం నుంచి పది రోజులపాటు క్యూసీఐ ప్రతినిధులు రామగుండం నగరంలోనే ఉంటారని సమాచారం. వీరి వెంట ఎన్విరాల్‌మెంట్ ఇంజినీరు మధూకర్, అధికారి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

- పెద్దపల్లి ఏసీపీ కృష్ణ



మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్: రౌడీషీటర్లు తమ పద్ధతులు మార్చుకుని సత్ప్రవర్తనతో వ్యవహరించాలని ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు. సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్‌లోని సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల రౌడీషీటర్లతో శనివారం సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఏసీపీ కృష్ణ మాట్లాడుతూ, ప్రజలపై గొడవలు, అల్లర్లు, బెదిరింపులకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తామన్నారు. ఇలా చేయడం ద్వారా పదేపదే జైలుకు వెళ్తారని, అలాకాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఆయన సూచించారు. రౌడీషీటర్లు మళ్లీ గొడవలకు దిగి తమ కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోవద్దని కోరారు. అందరితో కలిసి సంతోషంగా గడపాలని ఆయన అన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనికి వెళ్లి.. కుప్పకూలీ 'కూలీ'


లచ్చయ్య (ఫైల్)

చందుర్తి (వేములవాడ): ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఓ కూలీ మృతిచెందిన ఘటన చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాలు.. మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య (58) శనివారం గ్రామంలో ఉపాధి పథకంలో భాగంగా మట్టిరోడ్డు నిర్మాణ పనులకు వెళ్లాడు. ఉదయం 9.30 గంటలకు భోజనం చేసేందుకు చెట్టు కిందికి వస్తున్న క్రమంలోనే స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే తోటి కూలీలు మోటారు సైకిల్‌పై వేములవాడ తరలించేందుకు మల్లారం గ్రామం వరకు వెళ్లగా.. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా వారంరోజులుగా ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా వడదెబ్బతో మృతి చెందాడని అనుమానాలు వ్యక్తం కావడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గుండారం శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగాయాలకు గురయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండాకు చెందిన భూక్య జవహర్, లాల్‌సింగ్ ద్విచక్ర వాహనంపై మండలంలోని రాచర్లగొల్లపల్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరికి గాయాలు కాగా లాల్‌సింగ్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్ రోడ్‌లో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరా లు.. సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వ ద్దూరి రాజు, వద్దూరి కిషన్ బైక్‌పై వెళ్తుండగా కా రు ఢీకొట్టింది. ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

చెవికమ్మ అప్పగింత



శంకరపట్నం (మానకొండూర్): ఆర్టీసీ బస్సులో ఓ మహిళ చెవికమ్మ పోగొట్టుకోగా కండక్టర్ సుధాకర్ వెతికి బాధితురాలి బంధువుకు అందించిన ఘటన కేశవపట్నం బస్టాండ్‌లో వెలుగుచూసింది. హుజురాబాద్‌కు చెందిన ఓ మహిళ శనివారం హనుమకొండలో నిజామాబాద్ డిపో బస్సు ఎక్కింది. హుజూరాబాద్ బస్టాండ్ రాగానే బస్సు దిగింది. చెవి కమ్మ కనిపించకపోవడంతో బస్సు సీట్లో పడిపోయి ఉంటుందని, టికెట్ ఆధారంగా కండక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో కండక్టర్ బస్సులో వెతికాడు. సదరు మహిళ కూర్చున్న సీటు వద్ద చెవికమ్మ కనిపించడంతో బాధితురాలికి విషయం తెలిపాడు. కేశవపట్నంలో తమ బంధువులు ఉన్నారని, వారిని పంపిస్తానని బాధిత మహిళ చెప్పడంతో.. స్వరూప అనే మహిళకు కండక్టర్ చెవికమ్మ అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మహేశ్(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పిల్లలు పుట్టడం లేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై రామ్మోహన్ తెలిపిన వివరాలు. మామిండ్ల మహేశ్(30)కు నాలుగేళ్ల క్రితం కల్పనతో వివాహమైంది. పిల్ల లు పుట్టడం లేదని మానసికంగా వేదనకు గురయ్యాడు. ఈనెల 17న పురుగుల మందు తాగగా.. ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్టీరింగ్ ఊడి.. బోల్తా పడి


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు


బాధితుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు


బోల్తాపడిన ఆటో

16 మంది మహిళా కూలీలకు గాయాలు

- మిర్చి ఏరేందుకు తీసుకెళ్తుండగా బోల్తాపడిన ఆటో
- ముగ్గురి పరిస్థితి విషమం.. ఆస్పత్రులకు తరలింపు

మంథని: వ్యవసాయ పనుల కోసం కూలీలను తీసుకెళ్తున్న ఆటో పెద్దపల్లి జిల్లా కాటారం– మంథని ప్రధాన రహదారి నాగేపల్లి క్రాస్ వద్ద బోల్తాపడిన ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు. ఇందులో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా కరీంనగర్, గోదావరిఖని ఆస్పత్రులకు తరలించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన 16 మంది మహిళా కూలీలు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లారంలో మిర్చి ఏరేందుకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో ఆటో స్టీరింగ్ రాడ్ ఊడి అదుపుతప్పి బోల్తాపడింది. అందులోని కూలీలకు గాయాలయ్యాయి.

ఆస్పత్రులకు తరలింపు..

ఆటో బోల్తాపడిన ఘటనలో గాయపడినవారిని దారివెంట వచ్చే వాహనాలతోపాటు స్థానికులు సమకూర్చిన వాహనాల్లో మంథనిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో బొందల కిష్టమ్మ తల, అప్పాల శైలజ చేయి, అప్పల వనిత భుజానికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. గడ్డి మల్లక్క, సత్తమ్మ, సమత, ఎర్రమ్మ, కందుల రాజేశ్వరి, పోసక్క, కోలగాని సమ్మక్క, గౌరక్క, జంగ లక్ష్మి, కమ్మబోయిన స్రవంతి, కమల, బోధ మల్లమ్మతోపాటు మరో మహిళా కూలీని పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. డ్రైవర్ సతీశ్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు అధికారులను అప్రమత్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కాంగ్రెస్ సోషల్ మీడియా నాయకులు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడినవారిని గోదావరిఖనిలో ఏసీపీ రమేశ్, మంథని సీఐ రాజు, ఎస్సై రమేశ్‌తోపాటు పోలీస్ సిబ్బంది కలిసి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్

- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: హనుమాన్ చిన్న జయంతికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామి జయంతి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ తదితర వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో నిత్యం శానిటేషన్ నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 11 నుంచి 13 వరకు నిర్వహించే హనుమాన్ చిన్న జయంతికి ఇప్పటి నుంచే అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి


పోలీసులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

- రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా

గోదావరిఖని(రామగుండం): నిందితులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా కోర్టు కానిస్టేబుళ్లు మానవత్వంతో మెదలాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా స్పష్టం చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో శనివారం కమిషనరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిందితులకు శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. నేరస్తులకు వారెంట్లు, సమన్లు సత్వరం ఎగ్జిక్యూట్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటే మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. కాగా కోర్టు డ్యూటీ విధుల్లో క్రమశిక్షణతో పనిచేస్తూ హత్య, హత్యాయత్నం, చీటింగ్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసిన, లోక్ అదాలత్ కేసుల్లో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, లీగల్‌సెల్ సీఐ కృష్ణ, సీసీఆర్‌బీసీ సీఐ సతీశ్, ఐటి సెల్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్, సీసీ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రపురికి ఆధ్యాత్మిక శోభ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

మంథని: నిత్యం వేద ఘోషతో పరిఢవిల్లె మంత్రపురి మరో అరుదైన ఘట్టానికి వేదిక కాబోతుంది. మంథనిలోని లక్ష్మీ నృసింహగార్డెన్‌లో ఆదివారం సామూహిక గీతా పారాయణం నిర్వహించనున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలువురు పీఠాధిపతులు హాజరుకానున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదువేల మందితో..

గతంలో ఎక్కడా లేని విధంగా మంథనిలో ఐదు వేల మందితో సామూహిక గీతా పారాయణం నిర్వహించనున్నారు. అయితే ప్రపంచంలోనే ఇలాంటి ఉత్సవం జరగలేదని సనాతనధర్మ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. భగవద్గీతను ఇంటింటా చేర్చడానికి ఐదేళ్ల క్రితం ఉద్యమం ప్రారంభం కాగా, 40 వేల మందికి చేర్చినట్లు ఇటీవల సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలోని 70 ప్రాంతాలకు చెందిన గీత పారాయణ భక్తులు హాజరుకానున్నారు. అలాగే తెలుగు సాహితీ వేత్త, భగవత్ గీత ప్రవచకులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి హాజరవుతారు. మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయం నుంచి ఉదయం 8.30 గంటలకు శోభాయాత్ర నిర్వహించిన అనంతరం సామూహిక గీత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిసారు.

30 నుంచి శ్రీరామ నవరాత్రోత్సవాలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు శ్రీరామ నవరాత్రోత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. రోజూ ఉదయం 6.30 గంటలకు స్వామివారికి, సీతారామచంద్ర స్వామికి, పరివార అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30న ఉగాది పండుగ పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు, సాయంత్రం 4.30 గంటలకు పంచాంగ శ్రవణము, పండిత సత్కారం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారి పెద్దసేవపై ఊరేగిస్తారు. ఏప్రిల్ 4 నుంచి 6 వరకు భక్తోత్సవం, 6న ఉదయం 11.55 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని ఈవో పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం పూర్ణాహుతి, రథోత్సవం, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

సూత్రధారి ఎవరు?

- టీడీఎస్ సొమ్ము స్వాహాపై విచారిస్తున్న అధికారులు
- బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో టీడీఎస్‌కు సంబంధించి సొమ్ము కాజేసిన ఘటనలో సూత్రధారి ఎవరన్నదానిపై విచారణ జరుగుతోంది. జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు టాక్స్ ప్రాక్టిషనర్ ఈ వ్యవహారానికి తెరలేపినట్లు తెలుస్తోంది. జిల్లాలో 2006లో రైల్వేలైన్ మంజూరైన సమయంలో దాదాపు 200 మందికి చెందిన రైతులకు సంబంధించి భూములు కోల్పోయారు. దీనికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఈ నష్టపరిహారాన్ని డిపాజిట్ చేశారు. ఆదాయపు పన్ను శాఖ వారు పాన్‌కార్డు ఉన్న రైతుల నుంచి 10 శాతం, లేని రైతుల నుంచి 20 శాతం చొప్పున టీడీఎస్ కట్ చేశారు. ఇందులో 36 మంది రైతులకు పాన్‌కార్డు లేకపోవడంతో వారి సొమ్మును క్లెయిమ్ చేసుకునేందుకు ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. టీడీఎస్ సొమ్ముకు సంబంధించిన భూ నిర్వాసితుల వివరాలు రెవెన్యూ అధికారులు ఇచ్చినప్పటికీ వారి పేర్లు కాకుండా ఇతరుల పేర్లపై క్లెయిమ్ చేసి సొమ్ము కాజేసినట్లు ఇన్‌కమ్ టాక్స్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం విచారణ చేపట్టారు. సూత్రధారి ఎవరన్నదానిపై విచారణ చేపడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. దాదాపు 36 మంది రైతులకు చెందిన సుమారు రూ.50 లక్షల వరకు గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది.

చెట్టుకొమ్మలు కొడుతుండగా..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


చెట్టుపై నర్సయ్య మృతదేహం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బోయినపల్లి(చొప్పదండి): చెట్టు కొమ్మలు కరెంట్ తీగలపై పడుతున్నాయని.. కొమ్మలు కొట్టే ప్రయత్నంలో ఓ కొమ్మ మేయిన్ విద్యుత్ తీగపై పడి మండలంలోని మాన్వాడ గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య (58) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. మాన్వాడకు చెందిన నర్సయ్య ఇంటి ముందు ఉన్న మునగ చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడుతున్నాయని శనివారం కొమ్మలు కొట్టడానికి చెట్టు ఎక్కాడు. కొమ్మలు కొడుతుండగా ఓ కొమ్మ విద్యుత్ మేయిన్ తీగపై పడడంతో నర్సయ్యకు విద్యుత్ షాక్ తగిలి చెట్టుపైనే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా 'మానేరు' వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల 39వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్‌ఈ పాఠశాల ఆవరణలో అట్టహాసంగా జరిగాయి. తేజస్– 2025 పేరిట నిర్వహించిన వేడుకలను శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 39 ఏళ్లుగా మానేరు విద్యాసంస్థలు దిగ్విజయంగా నడుస్తుండడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, 1986లో కరీంనగర్‌లో 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన విద్యాసంస్థలు నేడు ఎన్నో వేల మందికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించేలా రూపుదిద్దుకున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలలో చదివిన చాలా మంది నేడు ఉన్నతస్థానాలకు ఎదిగారని వివరించారు. అనంతరం మానేర్ క్యాట్ 2025 పరీక్షలో టాప్ టెన్‌లో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి, కడారి సునీతారెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు


దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్, బస్సు ముందుభాగం

కోరుట్ల: పట్టణంలోని కృష్ణ మందిరం వద్ద జాతీయ రహదారిపై శనివారం గౌతమ్ హైస్కూల్‌కు చెందిన బస్సు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. బస్సులో డ్రైవర్, క్లీనర్ తప్ప ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాలు.. స్కూల్ ముగిసిన తర్వాత విద్యార్థులను ఇళ్లకు చేర్చి వెళ్లే క్రమంలో జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా డ్రైవర్ మారుతి బస్సు వేగంగా నడపడంతో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. బస్సు ముందుభాగం దెబ్బతింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి పేలింది. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ డిపోలో ట్రాక్టర్ పరికరాలు మాయం


ఆర్టీసీ డిపోలో ట్రాక్టర్

కోరుట్ల: ఇసుక అక్రమ రవాణా కారణంగా కోరుట్ల ఆర్టీసీ డిపోలో ఉంచిన ట్రాక్టర్ నుంచి విడిభాగాలు మాయం కావడం ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది. వివరాలు.. ఫిబ్రవరి 24న అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్(టీఎస్ 21టీ 4499)ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అనంతరం రూ.25 వేలు జరిమానా వేసి ట్రాక్టర్‌ను ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈక్రమంలో ట్రాక్టర్ యజమాని సంగ గంగాధర్ రెండు రోజుల క్రితం జరిమానా కట్టి రెవెన్యూ అధికారుల నుంచి ట్రాక్టర్ రిలీజ్ ఆర్డర్ తీసుకుని ఆర్టీసీ డిపోకు వెళ్లగా సుమారు రూ.5 వేలు విలువైన ట్రాక్టర్ విడి భాగాలు కనిపించలేదు. డిపోలో ఉంచిన ట్రాక్టర్ నుంచి విడి భాగాలు ఎలా మాయమయ్యాయని ఆందోళన చెందిన గంగాధర్ రెండురోజుల క్రితం డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై డిపో మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ, ఆర్టీసీ డిపోలో ఉన్న సమయంలో ట్రాక్టర్ విడి భాగాలు మాయమైనట్లు తమకు ఫిర్యాదు వచ్చిందని పూర్తి స్థాయి విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

పురుగులమందు తాగి.. ఆపై ఉరేసుకుని..

- భర్త వైద్య పరీక్షలు చేయించుకోవడం లేదని మనోవేదన
- తెలుకుంటలో వివాహిత ఆత్మహత్య


పద్మ(ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): తెలుకుంట గ్రామానికి చెందిన వివాహిత మేకల పద్మ(48) శుక్రవారం రాత్రి పురుగులమందు తాగి, ఆ తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మేకల తిరుపతి, ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. తిరుపతి ఉపాధి కోసం 13ఏళ్ల క్రితం మలేషియా దేశానికి వెళ్లాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పట్నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. అయితే, నెలరోజుల క్రితం అతడికి జ్వరం వచ్చింది. పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించగా.. వైద్యులు మందులు ఇచ్చారు. ఆ మందులు వాడినా జ్వరం తగ్గలేదు. దీంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. విదేశాలకు వెళ్లివచ్చినందున మరికొన్ని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. పరీక్షలు చేయించుకోవాలని అతడి భార్య పద్మ కూడా అనేకసార్లు చెప్పినా నిరాకరించాడు. దీంతో మనోవేదనకు గురైన పద్మ ఇంట్లోని పురుగుల మందు తాగి, దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. మృతురాలి కూతురుకు వివాహం కాగా, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా


తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన ఓ మహిళ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో శనివారం తహసీల్దార్ సుజాత జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు. అల్మాస్‌పూర్‌కు చెందిన భూక్య జ్యోతి గతంలో నాటుసారా తయారు చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడింది. జ్యోతిని అరెస్ట్ చేసిన అధికారులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ సమయంలో తిరిగి సాటుసారా తయారు చేయబోమని నగదు పూచీకత్తుపై అప్పటి తహసీల్దార్‌కు ఒప్పందపత్రం రాసి ఇచ్చారు. కాగా జ్యోతి మళ్లీ నాటుసారా తయారు చేసి విక్రయిస్తూ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన జ్యోతిని ఎక్సైజ్ అధికారులు శనివారం అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.20వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. దాడిలో సిబ్బంది రాజేందర్, రాజు, మల్లేశ్, కిశోర్‌కుమార్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్


యువకుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఓ వైపు కూలీ పని చేస్తూ.. మరోవైపు గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన పోగుల అజయ్ కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కోరుట్లకు వచ్చి విగ్రహాలు తయారు చేసే షాపులో పని చేస్తున్నాడు. శనివారం ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ సిబ్బందితో కలిసి మేడిపల్లి క్రాసింగ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, అజయ్ బైక్‌పై అటు వైపు వచ్చాడు. అక్కడ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంబడించి పట్టుకున్నారు. అనంతరం అతడి జేబులను పరిశీలించగా 300 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఒక గంజాయి, మరో రెండు ఇతర కేసుల్లో అజయ్ అరెస్ట్ అయినట్లు సీఐ పేర్కొన్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్పీ ఆదేశాల మేరకు 14 రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 91మంది మందుబాబులు పట్టుబడ్డారు. వారిని శనివారం కోర్టులో హాజరుపరచగా 50 మందికి జరిమానా, 41 మందికి జైలు శిక్ష విధిస్తూ (ఇద్దరికి ఏడు రోజులు, ఏడుగురికి మూడు రోజులు, ఐదుగురికి ఐదు రోజులు, 27 మందికి రెండు రోజులు) జడ్జి జ్యోతిర్మయి తీర్పు చెప్పారని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వారందరికీ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ ఎస్సై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకెప్పుడు మద్యం తాగి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు. రోజూ డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.